# ఒక అమ్మాయీ — ఇద్దరబ్బాయిలూ

పిసుపాటి ఉమామహేశ్వరం



"ఎవరిచ్చార్రా ఇది ?"

బాబిగాడు తెచ్చిన పుస్తకాన్ని చూసి ఆశ్చర్యపోయింది లక్ష్మి.

అది ఏ పత్రికా కాదు డైరీ!

"ఎవరిచ్చార్రా ఇదీ."

"భాస్కర్రావు గారివ్వలేదక్కా. టేబుల్మీదుంటే నేనే పట్టుకొచ్చేశాను."

'ఆ మాత్రం స్వతంత్రం నాకు లేదనుకున్నావా ?' అన్న ధీమా ధ్వనించింది వాడి కంఠంలో.

"అతనేం జేస్తున్నాడు ?"

"నిద్దరపోతున్నాడు."

"సరె నువ్ పో."

గెంతుకుంటూ వెళ్ళిపోయాడు బాబి

సినిమాతార బొమ్మ అట్ట వేసుంటే యిది కూడా పత్రికే అనుకున్నాడు కుర్రకుంక. వాడికేం తెలుసు — అవునూ — ఇంత పెద్ద డైరీలు కూడా ఉంటాయా !

లోపల్నుంచి వినిపించిన తల్లి కేక లక్ష్మి ఆలోచనలకు అంతరాయం కలిగించింది.

"వస్తున్నానమ్మా"

డైరీని తన గదిలో దాచి వంటింట్లోకి పరిగెట్టింది.

* * *

ఓ వయసొచ్చిన పట్నంలో అదో మేడ. ఆ మేడమీద రెండో అంతస్థు. అందులో వరండాకి రెండు చివర్లా ఉన్న రూమ్సులో భాస్కర్రావూ, రామారావూ అనే ఇద్దరు యువక స్టూడెంట్లూ, మధ్యభాగంలో పగటు ఆంధ్ర కుటుంబానికి ప్రతీకగా నిలవదగిన నరసింహారావుగారనే ఓ నడి గృహస్థూ అద్దెకుంటున్నారు.

* * *

పని పూర్తిచేసి వచ్చిన లక్ష్మి దిండు క్రింద నుంచి డైరీతీసి చేత్తో పట్టుకుని "చదువుదామా? వద్దా ?" అన్న డైలాగును అధికం జేసుకుంది.

ఇంకోళ్ళ డైరీ చదవడం తప్పే ఆ విషయం జ్ఞానం వచ్చిన ప్రతి ప్రాణికి తెలుసు. కరెక్టే. కానీ తనని గురించి భాస్కర్రావు అభిప్రాయం తెలుసుకోవాలంటే ఇదొక్కటే మార్గం.

ఆ క్షణం లక్ష్మి మనస్సులో తమ భాగానికి ఎడా పెడా అద్దెకుంటున్న భాస్కర్రామారావులు మెదిలారు.

రామారావు మంచివాడు. నెమ్మదస్తుడు. అతనితో ఓ గంట పరిచయం ఉన్నవాళ్ళైనా సరే. చటుక్కున ఈ అభిప్రాయానికి రాక తప్పదు. వంచిన తల ఎత్తకుండా కాలేజీకి పోయివస్తాడు. తనపక్కన వందమంది ఆడపిల్లలు (నగ్నంగా). నిల్చున్నా సరే కన్నెత్తి చూడడు. కన్నెత్తకుండా కూడా చూడడు. బొత్తిగా ట్రేడ్మార్కు 'బుద్ధిమంతుడు'.

ఇలా లోకంలోని మంచి గుణాలన్నీ కలబోయగా తయారైన రామారావు తనకి తెలీకుండానే లక్ష్మి మనస్సుని ఇట్టే ఆకర్షించాడు. ఆ పని అయిపోయింతర్వాతకూడా అతనికావిషయం తెలీదు.

తనకి తెలీకుండానే అతనంటే ఇష్టం ఏర్పడి దరిమిలా అది ప్రేమగా తర్జుమాఐపోయింది లక్ష్మి హృదయంలో.

ఇన్నాళ్ళుగా కలిసుంటున్నా తమ పక్కభాగంలో ఓ పదెనిమిదేళ్ళ పడుచు ఉన్నదని రామారావుకి తెలీదు కొంత కాలం తర్వాత తెలిసినా ఆమె పేరు లక్ష్మి అనీ ఆమెని చూసినవారు మొదటిసారే కాకుండా. ప్రతిసారీ మతి పోగొట్టుకుని కొండపల్లి బొమ్మలా నిల్చుండిపోవడం అనవాయితీ అని అస్సలు తెలీదు. అలా తన చుట్టూ గిరిగీసుకుని ఆ గిరిలోనే గుడుగుడు గుంజాలాడుకునే రామారావుని ఆకర్షించుకోవాలన్న తపన లక్ష్మిలో ఎక్కువైపోయింది. ఆ గిరిలో తనుకూడా ప్రవేశించడం కోసం అనేక ప్రయత్నాలు చేసింది.

లక్ష్మి రామారావుని ఆకర్షించుకోడానికి అంత ఉధృతంగా ప్రయత్నించడానికి పరోక్షంగా భాస్కర్రావు ప్రవర్తనకూడా కారణం.

భాస్కర్రావు జల్సా పురుషుడు. ధనవంతుల బిడ్డ రోజుకో డ్రెస్ మారుస్తాడు. పూటకో ఫేషన్ మారుస్తాడు. విడుదలైన ప్రతి సినిమా చూస్తాడు. మార్కెట్లో కనిపించిన ప్రతి పత్రికా కొంటాడు. కొత్తరోజుల్లోని ఇల్లరికపుటల్లుళ్ళా ఫెళ ఫెళలాడిపోతూంటాడు.

ఇన్ని దుర్గుణాల ప్రోవైన భాస్కర్రావు లక్ష్మిని మొదటిసారి చూడగానే ప్రేమించేడు. అంతటితో ఆగక పత్రికలద్వారా. సినిమాల ద్వారా, తోటి (సఫల, భగ్న) ప్రేమికులద్వారా నేర్చుకున్న చిట్కాలన్నీ ప్రయోగించసాగేడు. అతగాడి విలక్షణమైన ప్రవర్తన పుట్టించిన వెలపరం రామారావుమీది యిష్టాన్ని మరింత యినుమడింపజేసింది లక్ష్మిలో.

లక్ష్మికి పత్రికలంటే ఇష్టం. కాదు ప్రాణం. భాస్కర్రావు అన్ని పత్రికలూ కొంటాడు.

తన వాలుచూపు చూస్తేచాలు పడిచచ్చి పోతాడు.

ఈ అభిప్రాయానికొచ్చిన లక్ష్మి ఎందుకేనా మంచిదని తడిసి పెట్టింది భాస్కర్రావుని.

దాబీగాణ్ణి పంపిస్తే ఏపుస్తకమైనా, ఎప్పుడు కావాలన్నా ఇచ్చేస్తాడు— అతనివ్వక పోయినా వీడే తీస్కొచ్చేటంత స్వాతంత్ర్యం ఉంది అతని దగ్గిర.

ఈ ఒక్క విషయంలోనూ మాత్రం భాస్కర్రావంటె సదభిప్రాయం ఉంది లక్ష్మికి.

రామారావు పిల్లల్ని దరిజేరనివ్వడు. పెద్ద వాళ్ళతోకూడా మాట్లాడ్డు. తన చదువేమో, తనేమో.

భాస్కర్రా వలాకాదు. ఆమె తమ్ముళ్ళకి, చెల్లెళ్ళకి బిస్కెట్లూ చాక్లెట్లూ పెడతాడు. ఒక్కొక్కప్పుడు వాళ్ళనికూడా సినిమాకు తీస్కెళతాడు. వాళ్ళతని నెత్తిమీదెక్కి పిండి కొడతారు.

రామారావు జోలికే పోరు. అతనంటే వాళ్ళకి భయం. అయిష్టం. నరసింహారావుగారికి భాస్కర్రావు పోకిరీ వేషాలు నచ్చకిరావు లక్ష్మికి మల్లే. రామారావు వినయం వందనం ఆయన్నాకర్షించాయి. ఆయనే అప్పుడప్పుడూ రామారావు రూముకెళ్ళి పలకరించి వస్తూంటాడు. ఎప్పుడు చూసినా చేతిలో పుస్తకం ఉంటుంది.

"అజరామరవత్ప్రాజ్ఞః విద్యామర్థంచ సాధయేత్" అన్న ముక్కని నిజం చేసే రామారావంటే ఆయనకు తగని యిష్టం.

భాస్కర్రావుకి, క్లాసు పుస్తకాలకి చాలా దూరం. ఎప్పుడన్నా కాలేజీకెడితే చేత్తో పుచ్చుకుంటాడు తప్ప మళ్ళీ వాటి మొహమేనా చూడ్డు. ఎంతవరకూ తనసినిమాలేమిటో, షికార్లేమిటో!

తనవల్ల తండ్రి కూతుళ్ళకున్న అభిప్రాయాన్ని గ్రహించిన భాస్కర్రావు దూరం ఆలోచించి శారదాంబగారి దగ్గర చనువేర్పరచుకున్నాడు. ఆవిడేదన్నా సాయం అడిగితే శిరసావహించి రెట్టింపు ఫలితాన్నిచ్చేట్లు చేసేవాడు. అందువల్ల ఆవిడకి భాస్కర్రావు బాగా నచ్చాడు.

"నన్ను ముట్టుకోకు నా మాలకాకి" అన్నట్లుంటాడేమిటీ అంటుందావిడ రామారావు గురించి.

తల్లి అడుగుల చప్పుడు వినిపించేసరికి డైరీ దిండుక్రింద దాచేసి మాట్లాడకుండా పడుకుంది లక్ష్మి.

'ఏం జేస్తున్నావే'

"నిద్దరొస్తోందమ్మా"

"వేళగాని వేళ నిద్రేమిటే. పైగా సుకువారం గుడాను"

విసుక్కుంటూనే వెనక్కి తిరిగిందావిడ. ఆవిడ వెనకే లేచి తలుపు గడియేస్తూ అన్నది లక్ష్మి.

"పిల్లలెవర్నీ రానీకు. గొడవజేస్తారు"

తిరిగొచ్చి మళ్ళీ డైరీ తీసింది.

తనని గురించి భాస్కర్రావు అభిప్రాయం తెలుసుకోవాలంటే ఇదొక్కటే మార్గం.

అతని వెకిలి చేష్టలకి, విషపు చూపులకి అర్థమూ, తాత్పర్యమూ తెలుసుకోవాలంటే డైరీ చదవక తప్పదు. ఒక నిశ్చయానికి వచ్చి డైరీ తెరిచింది లక్ష్మి.

"లక్ష్మి నా జీవనలక్ష్మి"

"లక్ష్మి నా భాగ్యలక్ష్మి"

"లక్ష్మి నా పాలిటి దేవత"

"లక్ష్మి నా ఆరో ప్రాణం"

ఇలా ప్రతిపేజీ నడినెత్తినా బులెటిన్‌లాగా, స్లోగన్ లాగా ఏదో ఒకటి రాసి ఉన్నది.

ఆశ్చర్యపోయింది లక్ష్మి.

"ఇది కలా? నిజమా! ఇతను నిజంగా పిచ్చియర్ అవరా? నిసలైన ప్రేమపూజారా?"

కుతూహలం పెరిగింది. మొదట్నుంచీ పేజీలు తిరగేసింది.

జూలై 1

అవును. అదే అతను రూంలోకి అద్దెకొచ్చిన రోజు. రామారావు ఓ వారం పదిరోజుల తర్వాత వచ్చాడు. డైరీలోకి చూసింది లక్ష్మి.

మేడ మెట్లెక్కి వరండాలోకి వస్తూనే ఓ మెరుపు తీగెని చూశాను. అమృతం పంచడం అయిపోయాక వచ్చేసిన మోహినియో, ఆకాశ మార్గాన విమానంలో ప్రయాణంచేస్తూ కాలుజారి పడిన దేవతా స్త్రీయో అర్థంకాలేదు. ఓ గంట పోయాక వాళ్ళమ్మ పిలుస్తూంటే ఆ విద్యుల్లత పేరు "లక్ష్మి" అని తెలిసింది. ఎంత అందమైన పేరు. ఎంత తీయనైన పేరు. చూసిన మొదటి క్షణంలోనే ఆమె రూపం నా హృదయ ఫలకం మీద ముద్రితమై పోయింది. 'లవెట్ ఫస్ట్ సైటంటే' ఇదే కాబోలు.

పేజీలు తరుగుతున్న కొద్దీ లక్ష్మి మరింత ఆశ్చర్యానికి లోనుకాసాగింది. ఒక పక్క చదువుతూనే మరొక ప్రక్క ఆలోచిస్తోంది.

ఏమిటీ భాస్కర్రావు —పిచ్చివాడా? మంచి వాడా? తన వింత గాఢంగా ప్రేమిస్తున్నాడా?

తనకోసం పత్రికలన్నిటికీ చందాలు కట్టాడుట. తన కేరంగు లిష్టమో ఏ పువ్వులూ, ఏ పౌడర్లిష్టమో తెలుసుగుని తనూ అవే వాడుతున్నాడ్ట. తను శనివారాలుంటుందని తెలిసి తనూ శనివారాలుంచడం. మొదలెట్టాడుట. తనకోసమే జీవిస్తున్నాడుట. తను తిరస్కరిస్తే ఇహ తనకి జీవితమే లేదుట. తనని ఆకర్షించుకుని, పరిచయం జేస్కోడానికి చేస్తూన్న ప్రయత్నాలన్నిటినీ అపార్థం జేసుకుంటోందిట తను. తను చేసే ప్రతిపనీ వెనకాలవున్న మంచి హృదయం మరుగున పడిపోయి ఒక 'రౌడీ' లాగా తన దృష్టిలో నిలవడం కేవలం తన దురదృష్టంట!

మధ్యలో వచ్చిన రామారావు ప్రసక్తి చూసి మరింత ఆశ్చర్యపోయింది.


ఆగస్టు 23

లక్ష్మి రామారావుని ప్రేమిస్తోందని నా అనుమానం. రోజూ అతను కాలేజీనుంచి వచ్చే టైముకి ఎదురు చూస్తూంటుంది. వెనకాలే వచ్చిన నన్ను చూడగానే మొహం చిట్లించుకుని వెళ్ళిపోతుంది.

ఇలాగే చాలా రాశాడు.

తనని బాగా స్టడీ చేశాడన్నమాట భాస్కర్రావు.

తను వేసే ప్రతి అడుగుని. చూసే ప్రతి చూపునీ గమనించడమేకాదు. ఇందులో రికార్డ్ చేసేశాడు. రామారావు ఎడల తన ప్రవర్తనను.



డిజైన్ వి. శారదాకుమారి, విశాఖపట్నం

# ఒకమ్మాయి ఇద్దరబ్బాయిలు

అతన్ని ఆకర్షించుకోడానికి తనెన్ని ప్రయత్నాలు చేసిందీ, చేస్తున్నదీ అన్నీ విపులంగా రాసుకున్నాడు డైరీలో.

ఇవ్వి తెలిసి తన మనసు అతనిమీద లేదని తెలిసికూడా ఎందుకు ప్రయత్నిస్తున్నట్లు.

ఏనాటికైనా తన మంచి హృదయం, తన పవిత్ర ప్రేమ గుర్తింపుకు రాదా అన్న ఆశటః తన నిష్కల్మష ప్రేమ వృధా పోదన్న నమ్మకంటః

జనవరి 13.

ఇవేళ జరిగిన సంఘటన నా జన్మలో మర్చిపోలేను. ఈ సంఘటనతో లక్ష్మి హృదయంలో నా మీద ఏ మూలైనా కాస్త మంచి అభిప్రాయమంటూ ఉంటె అదీ ఈ నాటితో తుడిచి పెట్టుకుపోయింది.

లక్ష్మికి ఆ వాక్యాలు చదువుతూంటే ఆవేళ్టి సంఘటన కళ్ళముందు నిల్చింది. ఆవేళ—

రామారావు నిర్లిప్తతతో విసిగిపోయింది లక్ష్మి. 'ఎదురుగుండా ఓ పడుచు రారమ్మని ఆహ్వానిస్తూంటే పలకదేం ఖర్మ' అని విసుక్కుంది. ఎలాగేనా అతన్ని మాట్లాడించాలన్న తలంపు తీవ్రమైపోయింది. దానికితోడు భాస్కర్రావు పోజొకటి.

మామూలుగా రామారావు కాలేజి నుండి వచ్చేటైముకి వరండాలో నిల్చునుంది.

రామారావు క్రిందనించి మేడ మెట్లెక్కుతున్నాడు.

చటుక్కున ఒక ఆలోచన మెరిసింది.

గబగబా మెట్లు దిగి రామారావుకి అడ్డం వెళ్ళింది.

రామారావు వచ్చే ఊపుకి— మెట్లమధ్యన ఓ మలుపుంది— ఆ మలుపుదగ్గర డాష్ ఇవ్వాలి.

డాష్ఇచ్చి "సారీ" అంటే తను "పర్వాలేదు లెండి. నాదే తప్పు" అంటుంది.

"దెబ్బతగిలిందా" అంటాడు అతను.

"పెద్దగా తగల్లేదులెండి" అంటుంది తను.

"వెరీ వెరీ సారీ"

ఊహూ నాలిక కొరికేస్కుంటూన్న అతని సానుభూతిని, పశ్చాత్తాపాన్నీ చూసి పరవశించిపోతుంది.

మర్నాడు కనబడితే "హలో" అన్నట్లుగా నవ్వుతుంది తను.

"దెబ్బ నయమైందా'' అనడుగుతాడు.

అలా అలా పరిచయం పెరిగి ప్రేమలత వృద్ధవుతుంది.

ఇవ్నీ ఊహించుకుని ఎదురెళ్ళిన లక్ష్మిని చూడగానే రామారావు హఠాత్తుగా ఆగిపోయి బల్లిలా గోడనంటిపెట్టుగుని నెమ్మదిగా వెళ్ళిపోయాడు.

తుపుక్కున మొహాన ఉమ్మేసి హేళనగా నవ్వినట్లయింది.

ఘోరావమానం!

హఠాత్తుగా శరీరంబరువు వెయ్యిరెట్లు బరువెక్కువయి భూమిలోకి కుంచించుకుపోతున్నట్లుగా ఫీలయింది. నీరసం ఆవహించి అక్కడే కూలబడి భోరుమంటూ బిగ్గరగా ఏడుద్దామని పించింది.

లక్ష్మి ఆ షాక్‌నుండి తేరుకోకముందే వెనకాలే వస్తున్న భాస్కర్రావు బ్రహ్మాండమైన ఊపుమీద గుద్దుకున్నాడు. ఆమె తూలి పడబోతూంటే గట్టిగా పొదివి పట్టుకుని "సారీ" అన్నాడు.

దాని తెంపకాయ కొట్టాలనిపించింది లక్ష్మికి. వచ్చినంత ఊపులోనూ వెళ్ళిపోయాడు భాస్కర్రావు. నిలబడలేనంత నిస్సత్తువ ఆవహించిందామెను. ఎలా గదిలోకొచ్చిపడిందో ఆమెకే తెలీదు. దిండులో తలదూర్చి మనసు తేలికపడేవరకూ కసిదీరేలా కరువుదీరేలా ఏడ్చింది... ఏడ్చింది... అలాగే నిద్రపోయింది.

గతంనుండి వర్తమానంలోకొచ్చి చదవ సాగింది లక్ష్మి.

"మెట్లమీదున్న లక్ష్మిని చూడగానే నాలో ఏకో దుర్బుద్ధి ప్రవేశించింది. ఆమెకు "డాష్" ఇచ్చి తద్వారా పరిచయం చేసుకోవాలనుకున్నాను. అనుకున్న విధంగా చేశానుగానీ ఆ తర్వాత తెలిసింది అదెంత నీచమైనపనో. లక్ష్మి నన్ను గురించి ఏమనుకున్నదో. నా దేవత నన్ను కరుణిస్తుందో లేదో. చేసిం తప్పుకు శిక్షగా రెండ్రోజులు భోజనం మానెయ్యాలి అంతే. అదే తగిన శిక్ష!

ఇంకొంచెం ముందుకెళ్ళింది లక్ష్మి.

"లక్ష్మిని ఎలాగేనా క్షమించమని అడగాలనుంది. కానీ దీని వెనకగూడా ఏదన్నా దురుద్దేశం ఉన్నదని అనుమానిస్తుం దేమోనని భయంగా ఉంది."

సందేహం లేదు. లక్ష్మి రామారావుని ప్రేమిస్తున్నది. ఇక నా వైపు చూడదు. నేనామె కోసం ప్రయత్నించడం అనవసరం, వృధా. "నిజమైన ప్రేమ త్యాగాన్ని కోరుతుందంటారు. పురాణాలూ, చరిత్రలూ గుడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పాయి, నిసలైన ప్రేమికుడు తెరచాటున ఉండి ప్రేయసి సుఖసంతోషాలతో ఉంటే చూసి సంతోషించాల్సిందే. అమెను చేపట్టే అర్హతా, యోగ్యతా అతనికి లేవు."

"ఆల్‌రైట్! లక్ష్మి నాకు దక్కనపుడు నేనిక్కడ ఉండడం అనవసరం, ఇవాళ తెల్సుకున్నాను. నేను లక్ష్మిని ప్రేమించట్లేదు ఆరాధిస్తున్నాను. పూజిస్తున్నాను, ఆరాధనకి దేవత పక్కనే ఉండక్కర్లేదు. ఎక్కడ ఉన్నా మనసులో ఉంటే చాలు, లక్ష్మి నా హృదయంలో నిల్చిపోయింది. ఆ రూపాన్నెవరూ చెరిపివేయలేరు. ఈ అనుబంధాన్నెవరూ విడదీయలేరు. వెంటనే ఇంకో చోటుకి మారిపోవాలి"

"లక్ష్మి రామారావునీ పెళ్ళి చేసుకుని చిరకాలం సుఖ సంతోషాలతో వర్ధిల్లేట్టు చైమని దేవుణ్ణి రోజూ ప్రార్థించడంకన్న నేనేం చెయ్గల్ను!"

ఇక చదవలేకపోయింది లక్ష్మి డైరీ మూసి ఆలోచనలో పడిపోయింది. మళ్ళీ రామారావూ, భాస్కర్రావు కళ్ళముందు నిలిచారు.

రామారావు వినయ ప్రవర్తన— భాస్కర్రావు రౌడీ ప్రవర్తన.

వీటిలో ఏది సత్యం? ఏదసత్యం?

రౌడీ ప్రవర్తనంటే అర్థమేమిటి? నిర్వచన మేమిటి?


## ఉబ్బసమునకు ఔషధము

రాజస్థాన్‌కుచెందిన ప్రఖ్యాత రాజకీయ. సాంఘిక నాయకుడు కీ॥ శే॥ శ్రీ శంభునాథ్ మనుమడు శ్రీ కేశవమోహన్ లాల్‌చే ఉబ్బసమును నివారణచేయు ఔషధము ఇవ్వబడుతున్నది (పేదలకు) ఈ ఔషధము ఒక సన్యాసి శ్రీ శంభునాథ్‌కు ఇవ్వగా వారు 40 సంవత్సరములు ఉచితంగా పంచిపెట్టిరి. నిస్వార్థమైన సేవలకుగాను వారికి ప్రభుత్వ పెన్షన్ యివ్వడం జరిగినది. కాని ఈ కార్యం తన మనుమనికి అప్పగించి సన్యాసిగా మారిపోయెను. ఇప్పుడు వారి మనుమడు ఈ కార్యం కొనసాగించుచున్నారు. భాగ్యవంతుల నుండి ఈ కర్తవ్య నిర్వహణకు సహాయము కోరుచున్నారు. ఈ ఔషధము మూడు దోసులు మాత్రమే తీసుకొని చాలామంది ఉబ్బసపు రోగులు, దీర్ఘరోగములతో బాధపడేవారికి స్వస్థత చేకూరింది, రోగులు ఔషధం కొరకు ఇంగ్లీషులో మాత్రమే వ్రాయాలి.

SRI KESHAV MOHANLAL

5, Haralaldas Lane, Jerabagan Park, West, Calcutta-6 (India)

రోగులు, డాక్టర్లు, మెడికల్ ప్రాక్టీషనర్లు చేసిన సహాయముతో ఉబ్బసపు రోగుల సౌకర్యార్థము. పశ్చిమ బెంగాల్ సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం 1961 క్రింద రిజిష్టరు కాబడిన బాబా శ్రీ శంభునాథ్ సేవా కేంద్రము చే ప్రచురితమైనది.

తన నాకర్షించుగోడాని కెన్ని దారులైతే ఉన్నాయో అన్నీ తొక్కాడు భాస్కర్రావు. అది రౌడీ ప్రవర్తన ఎలా ఔతుందీ ?" తను ప్రయత్నించ లేదూ రామారావునీ ఆకర్షించుగోడానికి తనని గురించి రామారావు గుడా ఇలాగే అనుకుంటాడా ? అనుకుంటున్నాడా? తను గుడా రౌడీ పిల్లేనా ?

అసలు రౌడీ లక్షణాలు ఎలా ఉంటాయి ?

భాస్కర్రావుని చూడగానే ఎందుకు ఒళ్ళు మండిపోయింది? రామారావుని చూడగానే సిగ్గుతో మొగ్గయిపోయిందేం తను? అప్పటికింకా వాళ్ళిద్దర్నీ గురించి ఏమీ తెలియదు కదా?

లక్ష్మికి తెలుగు సినిమాలు గుర్తుకొచ్చేసరికి నవ్వొకుంది.

సినిమా మొదలవగానే ముందు విలనొచ్చి తలుపుకొడతాడు. తలుపు తెరిచిన హీరోయిన్‌కు ఒళ్ళు జలదరించి భయపడి ఇంట్లోకి పారిపోతుంది. (పాపం అతను మంచి దుస్తుల్లోనే ఉంటాడు. పైగా "వీడు విలను" అని వాడి మొహం మీద రాసుండదుకూడాను).

కాస్సేపయాక హీరోగారొచ్చి తలుపు కొడతారు. హీరోయిన్ అతణ్ణి చూడగానే సిగ్గుతో ముడుచుకుపోతుంది. వెంటనే ప్రేమ కొలకరి చొప్పున ఇద్దర్నీ ఆల్టర్నేట్‌గా చూపిస్తూ ఐదు నిముషాలపాటు ప్రేక్షకుల్ని ఊపిరి పీల్చుకో నివ్వడు దర్శకుడు.

అంతవరకూ కథ అంగుళంకూడా జరగదు. కేవలం పాత్రల పరిచయం. మరి హీరోయిన్ కెలా తెలుసు? వీడు హీరోనని వీడు విలననీను? తనూ తెలుగు హీరోయినేనా? అంత అవక తవకగానే తనుకూడా ప్రవర్తించిందా?

భాస్కర్రావు నిజంగా చెడ్డవాడు కాడా?

రామారావుయెడల తన ప్రవర్తనతో, తన యెడల భాస్కర్రావు ప్రవర్తన పోల్చి చూసుకుంటుంటే భాస్కర్రావు మంచివాడుగానూ, అతి మంచివాడుగానూ కనబడసాగేడు లక్ష్మికి.

అంతేకాదు. రామారావు వట్టి అర్భకుడుగానూ, పాపగానూ కనిపించ సాగేడు.

రామారావుకి రసహృదయం లేదు. 'వనిత తనంత తా వలచి వచ్చిన' తొలగిపోయేవారితో తనేం సుఖపడగలదు?

భాస్కర్రావు చురుకైనవాడు. ఆడువారి మనసెరిగి ప్రవర్తించడం అతనికి క్షుణ్ణంగా తెలుసు. అసలైన ప్రేమ పూజారి. నిసలైన సౌందర్యోపాసకుడు. అతని డైరీనిండా తనన గురించిన కవిత్వమే.

తన అభిరుచులూ, ఆశయాలూ, అభిప్రాయాలూ అన్నీ అర్థంచేసుకున్నవాడు. ఆకళింపు జేసుకున్నవాడు. పైగా అభిమానించి గౌరవించేవాడు.

అతని నీడలో తన జీవితం ఓహ్! స్వర్గం!

ఆలోచిస్తున్నకొద్దీ భాస్కర్రావు ప్రతీ కదలికా ఎంతో అర్థవంతంగానూ సమర్థనీయంగానూ తోచసాగింది. క్రమేణా లక్ష్మి హృదయంలో రామారావు రూపం చెరిగిపోయి ఆ స్థానంలో భాస్కర్రావు రూపం నిండసాగింది.

భాస్కర్రావు అభిప్రాయాలూ తన అభిప్రాయాలూ ఒకటే !

మెట్లదగ్గిర సన్నివేశం!

రామారావుతో దాషిచ్చి తద్వారా పరిచయం చేసుకోవాలనుకుంది. ది సేమ్ భాస్కర్రావు గుడా అంతే !

ఆ నాడు రామారావు దాషివ్వనందుకూ, భాస్కర్రావు ఇచ్చినందుకూ ఇద్దర్నీ తిట్టుకుంది. ఎందుకని ఆ తేడా ? ఇద్దరూ మగవాళ్ళేగదా ! సింపుల్ తన దృష్టిభేదం అంతే !

తనెంత వెర్రిది ! పాపం భాస్కర్రావుకూడా వెర్రివాడే. రెండ్రోజులు భోజనం మానివేశాట్ట! పూర్ ఫెలో.

భాస్కర్రావుమీద జాలేసింది.

ఎటువంటి వాణ్ణి తను ఎలా అపార్థం చేసుకుందీ !

లక్ష్మి మనసుకు పట్టిన మంచుతెరలు వీడిపోయాయి. జ్ఞానోదయమైంది.

ఏది పాలో ఏదినీరో తెలిసింది. తెలుసుకుంది.

ఇప్పుడామె హృదయంలో రామారావు రూపమే లేదు. ఓన్లీ భాస్కర్రావ్. నడినెత్తిన సూర్యుళ్ళాగా ప్రచండ తేజంతో ప్రజ్వరిల్లిపోతున్నాడు. మనసంతా కాల్చుకుతినేస్తున్నాడు.

ఇప్పటికీ చెయ్యి దాటిపోలేదు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి.

మనసులో ఏదో ఊహ తళుక్కుమంది.

కాగితం, కలం తీసుగుంది.

భాస్కర్రావు గారికి—

ప్రారంభించబోతుంటే చిన్న అనుమానం వచ్చింది. జీవిత భాగస్వామిని వీళ్ళద్దరిలోంచే ఎందుకు ఎన్నుకోవాలి ? దేశంలో ఇంకా ఎంత మందిలేరు. నాన్నావాళ్ళు సంబంధాలు చూడరా? తనకింత తొందరెందుకు ?

మరుక్షణం తనే సమాధానం చెప్పుకుంది.

నిజమే. ఉన్నారు. వేలూ లక్షలూ ఉన్నారు. కానీ తన మనసూ, మమతా తెలిసిందీ. అర్థం జేసుగున్నదీ భాస్కర్రావొక్కడే.

పైగా. తెలిసో తెలియకుండానో తమ ముగ్గురి మధ్యా ఒక ట్రయాంగిల్ ఫైట్ రగులుకుంది. అది తమ ముగ్గురిలోనే అంతమవాలి. సుఖాంతమవాలి. తనో అడుగు ముందుకెయ్యకపోతే పాపం భాస్కర్రావు లైఫ్ ఖతమైపోతుంది.

మనసెరిగిన మగవాడి అండకన్నా ఆడదానికింకేం కావాలి జీవితంలో. రాయడం ప్రారంభించింది.

భాస్కర్రావుగారికి —

మీరు నిద్రపోతున్నప్పుడు 'పత్రిక' అనుకొని మా బాబిగాడు మీ డైరీ తెచ్చాడు. మానవ సంబంధమైన కుతూహలం ఆపుకోలేక చదివాను. అది నాకెంతో మేలు చేసింది. ఇన్నాళ్ళికైనా వాస్తవం గ్రహించి ఇన్నాళ్ళూ, నే నే ఇల్యూజన్‌లో బ్రతికానో తెలుసుగుని మేలుకున్నాను. నేను మీ ప్రేమని మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. రామారావు విషయంలో నన్నపార్థం జేసోకుండా నా ప్రేమని అంగీకరిస్తారనీ, మీ పెద్దలను మా పెద్దలతో మాట్లాడించి వ్యవహారం గుట్టు చప్పుడు గాకుండా జరిపిస్తారని ఆశిస్తూ—

ఈ జన్మకే కాకుండా ఎన్ని జన్మలకైనా
మీ లక్ష్మి

ఉత్తరం మడిచి డైరీలో పెట్టి బాబిగాడిచేత పంపించేసింది.

* * *

ఆ తర్వాత నాలుగైదు రోజులకి ఓ శుభోదయాన హఠాత్తుగా భాస్కర్రామారావులు ఇద్దరూ మాయమయారు.

అంత అర్థరాత్రికి అర్ధరాత్రే ఎందుకు ఖాళీ చేయవలసి వచ్చిందో ఎవరికీ అర్థంగాలేదు. అందరికన్నా ఎక్కువ ఆశ్చర్యపోయింది లక్ష్మి.

ఆ మరునాడే లక్ష్మిపేర ఓ ఉత్తరం వచ్చింది.

ఆ దస్తూరీ భాస్కర్రావుది.

గుండె వేగం హెచ్చింది లక్ష్మికి. ఎవరూ చూడకుండా గదిలో కెళ్ళి, తలుపులు మూసి కవరు తెరిచింది.

లక్ష్మిగారికి —

భాస్కర్రామారావు లుభయులూ నమస్కరించి వ్రాయునది— "మగవాడి ప్రవర్తన ఏవిధంగా ఉంటే ఆడది ఆకర్షింపబడుతుంది" అన్న విషయంలో ఓ రోజున మా యిద్దరికీ భేదాభిప్రాయా లొచ్చాయి.

తలొంచుకుని దోవనే పోతూ వస్తూ, స్త్రీ పొడే గిట్టనట్లు విప్రనారాయణుడిలాగా ఉంటే వనితలు తావలచి వస్తారని వాడూ — ఎక్కడికక్కడ పోజులు నెరుకుతూ పైలాపచ్చీస్‌గా ఉంటే పడిపోతారని నేనూ వాదించుకున్నాం.

పందేలుకూడా కట్టుకున్నాం. ఎటూ తేలక ఎవరిమీదేనా ప్రయోగించి చూద్దామనుకున్నాం. ఆ తర్వాత కథ మీకు తెల్సిందే.

మీరు నన్ను గెలిపించినందుకు నా ధన్యవాదాలు. ఆ డైరీ ఉట్టి అభూతకల్పన కేవలం మీరు చూడ్డంకోసం రాసింది. మిమ్మల్ని సాధనంగా వాడుకున్నందుకు జమిలిగా మా క్షమాపణలు అందుకుంటారని ఆశిస్తూ—

వందనములు
భాస్కర్రామారావులు.

